ఆకస్మిక సర్వేపై అభ్యంతరం

పెనుకొండ: అధికారులు ఆకస్మికంగా సర్వే చేయడంపై స్థల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే అడ్డగోలుగా ఉందని మండిపడ్డారు. పెనుకొండలోని మడకశిర రోడ్డులో సర్వే నంబర్ 681లో 15 సెంట్ల స్థలాన్ని సుధాకర రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, పది సెంట్ల స్థలాన్ని రామలింగ మరికొందరు కొనుగోలు చేశారు. అయితే ఈ స్థలం గతంలో కోనాపురం, మంగాపురం, కొండాపురం గ్రామాలకు దారి ఉండేదని పలువురు అధికారులకు అర్జీలు అందజేశారు. స్థల యజమానుల్లో ఒకరైన సుధాకరరెడ్డి దీనిపై హైకోర్టును ఆశ్రయించారు. ఆ భూమి ప్రభుత్వానికి సంబంధించినది అయితే ప్రజల ప్రయోజనాలకు వాడుకోవచ్చని, ప్రైవేటు భూమి అయితే యజమానుల నుంచి కొనుగోలు చేసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గత కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ వినతితో అప్పటి తహసీల్దార్ సురేష్ ఆర్‌ఐ కోదండపాణి స్థలాన్ని సర్వే చేసి పై ఆ భూమి పూర్తి పట్టా భూమి అని నిర్ధారించారు. అయితే మరోసారి భూమిని సర్వే చేయాలని ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ గోరంట్ల శ్రీనివాసులు తహసీల్దార్ శ్రీధర్‌ను కోరడంతో మంగళవారం మధ్యాహ్నం సర్వేయర్ శ్రీనివాసరావుతో పాటు ఆర్‌ఐ భాస్కరరెడ్డి, మున్సిపల్ సిబ్బంది సదరు స్థలాన్ని పది నిమిషాల్లో సర్వే ముగించి, రాళ్లు పాతారు. దారి సుధాకర్‌రెడ్డి స్థలంలో ఉన్నట్లు తేల్చారు. సర్వే చేయాలని కోరిన వారిలో ఒకరైన డాక్టర్ రోహిల్, ఆయన భార్య చందన తదితరులు ఆ ప్రాంతానికి వచ్చారు. సర్వేయర్ మాట్లాడుతూ పై భూమి పూర్తిగా పట్టా భూమి అని, అయితే గతంలో రస్తా అని పేర్కొనడంతో ఆ మేరకు హద్దులు నిర్ణయించామన్నారు. సమాచారం తెలపకుండా ఉన్నపళంగా సర్వే చేశారని భూయజమానులు సుధాకరరెడ్డి, శ్రీకాంతరెడ్డి, రామలింగ తదితరులు విలేకరుల సమావేశంలో తెలిపారు.


స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

క్లుప్తంగా

యువతకు క్రీడా పోటీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

గోరంట్ల: యువతలో క్రీడా నైపుణ్యం పెంపొందించడానికి, కేంద్ర యువజన క్రీడా శాఖ అనుబంధ సంస్థ అయిన ప్రగతి పథం అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్‌ఏపీఎస్ జూనియర్ కళాశాలలో వాలీబాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన యువత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘విజ్ఞాన’ కాంతులు

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన సంబరాల పేరిట మంగళవారం మండల స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఎంఈఓ–2 జయభాస్కర్ సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించారు. కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాల విద్యార్థులు, జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు ప్రారంభం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాఠశాలల నుంచి తెచ్చిన నమూనాలను ప్రదర్శించారు. ఎంఈఓ గంగప్ప, ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం రమణకు పరిశీలించారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: మండలంలో మంగళవారం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. అడదాకులపల్లిలో మంత్రి సవిత పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్ కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోండి

మడకశిర/ మడకశిర రూరల్: సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు.ఆయన మంగళవారం పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీ, అచ్చంపల్లి, డీ రామగిరి గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.4 వేలకు పెంచామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి,మున్సిపల్ అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిష్కారానికి చర్యలు

మడకశిరరూరల్: భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. మంగళవారం బుళ్లసముద్రం గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ రంగమ్మ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు

మడకశిర: తిరుపతిలో మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మడకశిర వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, వాగేష్‌లు మాజీ మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని మాజీ మంత్రి అడిగి తెలుసుకున్నట్లు వారు తెలిపారు. అందరూ కలిసికట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారన్నారు.


మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన మడకశిర వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏపీఆర్‌ఎస్ ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం వీరిని పాఠశాలలో ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు అభినందించారు. ఎన్‌సీసీ అధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 21 నుంచి 29 వరకు కర్నూలు గ్రూపు ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపు 6 ఆంధ్ర బెటాలియన్ పోటీలు అనంతపురంలో నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా తరఫున ఏపీఆర్‌ఎస్ ఎన్‌సీసీ కేడెట్లు ప్రణయ్‌కుమార్‌రెడ్డి, నందకిషోర్ పాల్గొన్నారన్నారు. యోగా, పిరమిడ్స్, స్వచ్ఛ భారత్, డ్యాన్స్, బెస్ట్‌యాంకర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఇద్దరు విద్యార్థులు మెడల్స్ సాధించారు. విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ ఆర్మీ విభాగపు అధికారి అరుణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి


టీఎన్ దీపిక | ఈరలక్కప్ప | బలరామిరెడ్డి

హిందూపురం: 2025 నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీఎన్ దీపిక కోరుకున్నారు.

మడకశిర: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతుల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సాసీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

హిందూపురం: ప్రజలందరికీ మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరాన్ని మిత్రులు, శ్రేయోభిలాషులు బంధువులతో సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు.

వృత్తిలో నైపుణ్యం అవసరం

హిందూపురం అర్బన్: న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ న్యాయవాది అశ్వర్థనారాయణరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఏడీజేతోపాటు సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జిలు రాజ్యలక్ష్మి, లలితా లక్ష్మి, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, ఏపీపీ ఇందాద్ ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి , బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి అశ్వర్థనారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్మరణ సభలో న్యాయవాదులు సుదర్శన్, శివశంకర్, నాగరాజురెడ్డి, వన్నెరప్ప, రామచంద్రప్ప, సిద్ధూ, కృష్ణమూర్తి, కళావతి, త్రివేణిరెడ్డి, నవేరా పాల్గొన్నారు.


అశ్వర్థనారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల కమిటీలో చోటు

హిందూపురం: అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన పాంచజన్య శ్రీనివాసులు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కేఆర్ వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో సమావేశం నిర్వహించారు. ఇందులో కమిటీని ఎన్నుకోగా, శ్రీసత్యసాయి జిల్లా అపుస్మా ప్రెసిడెంట్‌గా హిందూపురం ఎస్.రియాజ్, సెక్రటరీ గౌస్‌బాషా, ట్రెజరర్ శ్రీకాంత్‌తోపాటు కమిటీ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు.


రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు | రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కేఆర్ వేణుగోపాల్

కొత్త ఆలోచనలతో ముందుకెళ్దాం

హిందూపురం అర్బన్: నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో ముందుకెళ్దామని న్యాయమూర్తులు కంపెల్ల శైలజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి, లలితా లక్ష్మి, సుకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ముందస్తుగా నూతన సంవత్స ర వేడుకలు జరుపుకున్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు, వివిధ కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో ముందస్తుగా వేడుకలు జరుపుకుంటున్న న్యాయమూర్తులు

అమిత్‌షా రాజీనామా చేయాలి

పెనుకొండ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎంపీ బీకే పార్థసారథి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు గంగాధర్, జీకే ప్రకాష్, వెంకటరాముడు, తిప్పన్న, వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

మడకశిర: మడకశిరలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో ఓటు హక్కు కలిగిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచించారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ సోనిబాయి,పర్సన్ ఇన్‌చార్జ్‌వెంకటరెడ్డి, సీఈఓ సురేష్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు ఈ-కేవైసీ చేయించుకుంటునే ప్రభుత్వం నుంచి పథకాలు అందుతాయని తెలిపారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, బాలికల వసతిగృహాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికల వసతి గృహంలో హాజరు, పాఠశాల హాజరు పట్టికలో వ్యత్యాసం ఉండడంతో బాలిక వసతి గృహం వార్డెన్ వినోదను విధుల నుంచి తొలగించాలని ఎంఈఓ భాస్కర్, డీఈఓను కోరారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జెడ్పీటీసీ ఉమేష్ ఉన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

రొళ్ల: వన్నారనపల్లి క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. ఆవినకుంటతండాకు చెందిన శశికిరణ్‌నాయక్ అరెస్ట్ చేసి 50 మద్యం ప్యాకెట్లు (90 ఎంఎల్) మద్యాన్ని స్వాధీనం చేసకున్నామన్నారు.

డ్రెయినేజీ మరమ్మతులు చేపట్టండి

పెనుకొండ: పట్టణంలోని కొత్తపేటలో మధ్యలోనే వదిలేసిన డ్రెయినేజీ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకులు హరి, బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, మహబూబ్‌బాషా, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అమరాపురం: భూ సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మారుతి ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం హేమావతి గ్రామ సచివాలయం- 2లో కార్యదర్శి సత్యరథ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. మొత్తం 28 మంది రైతులు అర్జీలు ఇచ్చారని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: మండల కేంద్రంలోని బసవనవీధి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రాంజీనాయక్‌ను ఉపాధ్యాయులు, నాయకులు మంగళవారం సన్మానించారు. రాంజీనాయక్ ఉద్యోగ విమరణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ఉపాధ్యాయ సంఘం నాయకులు సాయినాథ్, శ్రీనివాసరెడ్డి, విజయశేఖర్, రాందాస్‌నాయక్, సురేష్‌బాబు, ఇస్మాయిల్‌ఖాన్, హిదాయతుల్లా, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సజావుగా హుండీ కానుకల లెక్కింపు

పావగడ: స్థానిక నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం హుండీ కానుకల లెక్కింపు మంగళవారం సజావుగా జరిగింది. స్థానిక ఎండోమెంట్ అధికారి, తహసీల్దార్ వరదరాజు నేతృత్వంలో నాగలమడక కర్ణాటక గ్రామీణ బ్యాంకు సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కించారు. రూ 11.93 లక్షల ఆదాయం లభించిందని తహసీల్దార్ వరదరాజు తెలిపారు.

అనారోగ్యంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న కృష్ణమూర్తి(55) మంగళవారం మృతి చెందారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి అమరాపురంలోని తన స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డ్రైవర్ మృతికి డీఎం రామసుబ్బయ్య, ఎన్‌ఎంయూ, ఈయూ నాయకులు, సిబ్బంది సంతాపం తెలిపారు. అంత్యక్రియల కోసం ఆర్టీసీ అధికారులు రూ.15 వేలు నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

16లోపు ఉపాధి అవకాశాలకు దరఖాస్తు చేసుకోండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ మెప్మా విభాగం ఆధ్వర్యంలో హోం ట్రియాంగిల్ ఆఫ్ వారి సమన్వయంతో నిర్వహించే ఉపాధి అవకాశాలకు అర్హులైన వారు ఈనెల 16లోగా దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి కోరారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వడ్రంగులు, ప్లంబర్స్, విద్యుత్ పనులు, ఉపకరణాలు(ఏసీ, రిఫ్రిజిరేటర్,వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్) తదితర ఉపకరణాలను మరమ్మతు చేసేవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బ్యూటీషియన్‌కు సంబంధించిన పనులకు మహిళలు, పురుషులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను మెప్మా విభాగంలో అందించాలని సూచించారు.

ఆంధ్రాటిప్పర్ల ను అడ్డుకోవద్దు

పావగడ: ఆంధ్ర ప్రాంతాలకు చెందిన కంకర తదితర నిర్మాణ సామగ్రిని రవాణా చేసే టిప్పర్లను కర్ణాటక అధికారులు అడ్డుకోరాదని స్థానిక జేడీఎస్ నేత, మాజీ టీపీ అధ్యక్షుడు సొగడు వెంకటేశ్ సూచించారు. స్థానిక అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరిహద్దు లోని ఆంధ్ర, కర్ణాటక ప్రాంత వాసులు ఇచ్చి పుచ్చుకునే ధోరణి అనాదిగా ఉందని, అదే ఒరవడి కొనసాగించాలని కోరారు. ఇటీవల మడకశిరకు చెందిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి టిప్పర్లను అడ్డుకోవడం స్థానిక అధికారులకు తగదన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ నిర్వహిస్తున్న క్రషర్‌లో మాత్రమే కంకర ను కొనుగోలు చేయాలని శాసించడం అన్యాయమన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు తక్కువగా ఉంటే ఆంధ్రకు చెందిన క్రషర్లలో కూడా కొనుగోలు చేయవచ్చన్నారు. ఆంధ్ర టిప్పర్లను పావగడకు అనుమతించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అర్హులకు ‘పీఎంజేవై’ ఆరోగ్య బీమా

గుడిబండ: అర్హులకు పీఎంజేవై హెల్త్ స్కీమ్ ద్వారా ప్రత్యేక కార్డులు అందిస్తున్నామని గుండుమల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ రాధమ్మ మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు మండిపడ్డారు. ఎంపీడీఓ గంగాదర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్, డీటీ రామ్‌భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుండుమల వైద్యాధికారి శ్రీనివాస్‌నాయక్

విశ్రాంత డీఎస్పీకి సన్మానం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన విశ్రాంత డీఎస్పీ వీపీ గిరిధర్ ఏపీ 6వ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు పతకాలు, కంచు పతకం సాధించడంతో స్థానిక ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. 60 ఏళ్ల పైబడినా గిరిధర్ అథ్లెటిక్ పోటీల్లో షాట్‌పుట్, జావెలిన్ త్రోలలో రెండు బంగారు పతకాలు, డిస్కస్ త్రోలో బ్రాంజ్ పతకం సాధించారన్నారు. ఆయన 2025 ఫిబ్రవరిలో కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో జరిగే నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ నుంచి పాల్గొంటారన్నారు.


విశ్రాంత డీఎస్పీ గిరిధర్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు